క్లుప్తంగా

పార్టీని మరింత బలోపేతం చేయాలి



వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి

హిందూపురం: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కలిసికట్టుగా ఉంటూ పార్టీని మరింత బలపేతం చేయాలని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సూచించారని పార్టీ నియోజకవర్గ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన బెంగళూరు విమానాశ్రయంలో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు. మున్సిపల్ చైర్మన్ ఎన్నికలో నియోజకవర్గ ఇన్‌చార్జి టీఎన్. దీపికతో పాటు నాయకులందరూ ఎమ్మెల్యే బాలకృష్ణను దీటుగా ఎదుర్కొన్నారంటూ వైఎస్ జగన్ కొనియాడారని తెలిపారు. అలాగే పలు రాజకీయ అంశాలపై చర్చించి సూచనలిచ్చారని పేర్కొన్నారు.

పాడి రైతుల ఆర్థిక ప్రగతికి చర్యలు



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ: తాలూకా వ్యాప్తంగా పాడి పరిశ్రమతో జీవనం సాగిస్తున్న పాడి రైతుల ఆర్థిక ప్రగతికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తుముల్ అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే వెంకటేశ్ అన్నారు. స్థానిక నందిని క్షీర భవనంలో పాల సహకార సంఘాల కార్యదర్శులకు ఒక రోజు జిల్లా స్థాయి విశేష శిక్షణా శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాడి పరిశ్రమతో పాల రైతులు లాభాల బాట పట్టేలా తగిన చర్యలు చేపడతానని పునరుద్ఘాటించారు. పాడి ఆవుల కొనుగోలుకు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. ఈనెల 11వ తేదీ నుంచి లీటర్ పాలపై రూ.2 చొప్పున పెంచుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా సహకార యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ గౌడ, తుముల్ డైరెక్టర్ చంద్రశేఖర రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజేశ్, మాజీ చైర్మన్ శంకరరెడ్డి, కేశవ చంద్రదాస్, బత్తినేని నాని, టెంకాయల రవి తదితర అధికారులు, ఉద్యోగ సిబ్బంది పాల్గొన్నారు.

6 హెల్పర్ పోస్టులకు 21 దరఖాస్తులు

- 11న పెనుకొండలో ఇంటర్వ్యూలు

మడకశిర: మడకశిర, గుడిబండ ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌ల పరిధిలో ఖాళీగా ఉన్న 6 అంగనవాడీ హెల్పర్ పోస్టులకు 21 దరఖాస్తులు వచ్చినట్లు సీడీపీఓలు నాగమల్లేశ్వరి, శాంతలక్ష్మి తెలిపారు. ఈ పోస్టులకు ఈనెల 11న పెనుకొండ ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరగుతాయని పేర్కొన్నారు. అభ్యర్థులు అన్ని సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. మడకశిర ప్రాజెక్ట్ పరిధిలో 2 హెల్పర్ పోస్టులకు 8 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ పరిధిలో గ్యారగానహళ్లి అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు వివాదం కోర్టులో ఉందన్నారు. కేపాళ్యం మినీ అంగనవాడీ పోస్టుకు దరఖాస్తులు రాలేదని సీడీపీఓ నాగమల్లేశ్వరి తెలిపారు. గుడిబండ ప్రాజెక్ట్ పరిధిలో 4 హెల్పర్ పోస్టులకు 13 దరఖాస్తులు వచ్చాయని సీడీపీఓ శాంతలక్ష్మి వెల్లడించారు.

విద్యుత్‌శాఖ డీఈఈగా రఘు



మడకశిర రూరల్: మడకశిర డివిజన్ విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (డీఈఈ)గా ఎం.రఘు శుక్రవారం విద్యుత్‌శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన కడప నుంచి పదోన్నతిపై మడకశిర డీఈఈగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

విద్యార్థులకు అభినందన



ప్రశంసా పత్రాలను చూపుతున్న విద్యార్థులు

హిందూపురం టౌన్: అంతర్జాతీయ స్థాయిలో నాసా (యూఎస్‌ఏ ఫెడరల్ ఏజెన్సీ) నిర్వహించిన పోటీల్లో నారాయణ పాఠశాల విద్యార్థులు సృజన్, ప్రణవ్‌కార్తీక్ రెడ్డి బృందం రూపొందించిన 'లివ్ ఇన్ ఏ హెల్తీ స్పేస్' అనే ప్రాజెక్టుకు ద్వితీయ బహుమతి లభించింది. శుక్రవారం నారాయణ పాఠశాలలో విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఏజీఎం రమేష్ బాబు, కో-ఆర్డినేటర్ ప్రేమ్ సాగర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేష్, ప్రభాకర్ రెడ్డి, ఏఓ ముత్యాలన్న, నవీన్, నాసా ఇన్‌చార్జ్ కవిత, అకడమిక్ డీన్ పరమేష్, జగదీష్, తౌసిఫ్, పాల్గొన్నారు.

దిగుబడి ఘనం.. ధర పతనం

పడిపోయిన పుచ్చకాయల ధర

- టన్ను రూ.8 వేలు
- పెట్టుబడి చేతికి వస్తే చాలంటున్న రైతులు
- మడకశిర డివిజన్‌లో 62 ఎకరాల్లో సాగు



పుచ్చకాయలను తొలగిస్తున్న కూలీలు



కొనుగోలు చేసిన కాయలను వాహనంలో తరలిస్తున్న దృశ్యం

మడకశిర రూరల్: ఈ ఏడాది పుచ్చకాయలు సాగు చేసిన రైతులకు నష్టాలే మిగులుతున్నాయి. వేసవిలో పుచ్చకాయలకు మంచి ధర ఉంటుందని భావించిన రైతన్నలకు నిరాశే తప్పడం లేదు. నియోజకవర్గంలోని రొళ్ల, అగళి, అమరాపురం, మడకశిర, గుడిబండ మండలాల్లో బోరు బావుల కింద తక్కువ నీటితో పుచ్చకాయలు సాగు చేశారు. గత ఏడాది కంటే ప్రస్తుతం మార్కెట్‌లో ధర తగ్గుతుండగటంతో ఆశించిన స్థాయిలో ఆదాయం దక్కకపోవచ్చని చెబుతున్నారు. వర్షాధార పంటల సాగుకు అప్పులు చేసి తీవ్రంగా నష్టపోతున్న తరణంలో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించారు. ఎండకాలం ప్రారంభం సమయానికి పంట దిగుబడి వచ్చేలా విధంగా గత నవంబర్ నెలలో పుచ్చకాయ పంటను సాగు చేశారు. ఈ పంట సాగు చేయడానికి విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు ఎకరాకు రూ.లక్ష వరకు ఖర్చు చేశారు. ప్రస్తుతం పంట దిగుబడి బాగా వచ్చినా ఫలితం దక్కడం లేదు. పొలాల్లోనే కాయలను తొలగించి వ్యాపారస్తులకు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ధర తక్కువగా ఉన్నా పెట్టిన పెట్టుబడితో పాటు కొంత మేరకు ఆదాయం రావచ్చునని రైతులు చెబుతున్నారు. స్థానికంగా మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో ఇతర ప్రాంతాల్లోని మార్కెట్‌కు తరలిచండానికి ఖర్చులు ఎక్కువగా వస్తాయని పంట వద్దనే వ్యాపారస్తులకు కాయలను కేజీల ప్రకారం విక్రయిస్తున్నారు.

తగ్గిన సాగు విస్తీర్ణం..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడం లేదు. అన్నదాత సుఖీభవ కింద పెట్టుబడి సాయం ఖాతాల్లోకి జమ చేయకపోవడంతో ఏ ఏడాది పంటల సాగు విస్తీర్ణం తగ్గింది. పంటల సాగుకు అప్పులు చేస్తే పంట దిగుబడి వచ్చినా ధర లేకపోతే అప్పులు ఎలా తీర్చాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వ్యవసాయ రంగానికి వైఎస్ జగన్ ప్రాధాన్యత ఇచ్చారని చెబుతున్నారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో రైతులను కనీసం పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు.

ఐదు ఎకరాల్లో సాగు చేశా..



బోరు బావి కింద ఎకరాకు రూ.లక్ష ఖర్చు వరకూ పెట్టి ఐదు ఎకరాల్లో పుచ్చకాయలు సాగు చేశాను. పుచ్చకాయల పంట దిగుబడి బాగా వచ్చింది. అయితే గతం కంటే ధరలు భారీగా తగ్గిపోయాయి. టన్ను రూ. 8వేల చొప్పున 100 టన్నులు విక్రయించాను. పెట్టిన ఖర్చులన్నీ పోనూ చేసిన అప్పులకు వడ్డీ చెల్లించాను. కొంత ఆదాయం వచ్చింది.

– రవి కుమార్, రైతు, తురుకువాండ్లపల్లి

నీటి సమస్య పరిష్కరించాలని నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న తుమ్మలకుంట మహిళలు, సీపీఎం నేతలు

చిలమత్తూరు: తుమ్మలకుంటలో 15 రోజులుగా నెలకొన్న నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని గ్రామ మహిళలు సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఖాళీ బిందెలను నెత్తిన పెట్టుకుని నిరసన తెలిపారు. సీపీఎం జిల్లా నేత ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రజలు ట్యాంకర్లు ద్వారా నీటిని తోలించుకుంటున్నారని తెలిపారు. మెజారిటీ ప్రజలు చుట్టుపక్కల బోరు బావుల నుంచి నీటిని తెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. ఇది పూర్తిగా అధికారుల వైఫల్యమే అని మండిపడ్డారు. వెంటనే నీటి సమస్య పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం ఎంపీడీఓ రమణమూర్తికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు రామచంద్ర, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యను పరిష్కరించాలి

తుమ్మలకుంటతో పాటు మండలంలో నీటి సమస్య ఉన్న గ్రామాల్లో వెంటనే నీటి సమస్య పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎక్కడ నీటి సమస్య ఉన్నా ఎప్పటికప్పుడు పరిష్కారం చేశామన్నారు. అధికారులు, టీడీపీ నేతలు ఇప్పటికైనా కళ్లు తెరిచి నీటి సమస్య పరిష్కరించాలన్నారు.

ఆనిమేటర్లకు జీతాలు చెల్లించాలి



సమావేశమైన ఆనిమేటర్లు

లేపాక్షి: మండల వ్యాప్తంగా వెలుగు కార్యాలయంలో పని చేస్తున్న తమకు వెంటనే జీతాలు మంజూరు చేయాలని ఆనిమేటర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం కంచిసముద్రం గ్రామైక్య సంఘం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. 8 నెలలుగా జీతాలు చెల్లించక పోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఈ విషయాన్ని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. స్పందించిన పీడీ 5 నెలలు జీతాలు వేస్తున్నామని చెప్పినట్లు గుర్తు చేశారు. గ్రామైక్య సంఘాల్లో తీర్మానం చేసి జీతాలు చెల్లించాలని ఆదేశించారన్నారు. వారి ఆదేశాల మేరకు ఏపీఎం కార్యాలయం వద్దకు వెళ్లగా అందుబాటులో లేకపోయారని తెలిపారు. దిక్కుతోచని పరిస్థితిలో ఏరియా కో-ఆర్డినేటర్‌ను ఫోన్‌లో సంప్రదించినట్లు పేర్కొన్నారు. గ్రామైక్య సంఘంలో తీర్మానం చేసుకుని జీతాలు తీసుకోండి అన్ని చెప్పారని తెలిపారు. అయితే పీడీ, ఏసీ ఆదేశాలను కూడా ఏపీఎం దిక్కరించారన్నారు. అధికారులు స్పందించి జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రమాబాయి అంబేడ్కర్ జయంతి

హిందూపురం టౌన్: స్థానిక గురుకుల పాఠశాలలో శుక్రవారం దళిత సంఘాల ఆధ్వర్యంలో రమాబాయి అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్క విద్యార్థి రమాబాయి అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ, జైభీమ్ నాయకులు నాగరాజు, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కెంచమాంబ విగ్రహ ప్రతిష్ట



అలంకరణలో కెంచమాంబ దేవి



కలశాన్ని తీసుకెళ్తున్న హనుమంతనాథ స్వామి

అమరాపురం: గౌడనకుంట గ్రామంలో వెలసిన సోమేనహళ్లి జానకల్లు గోత్రానికి చెందిన కుల దేవత కెంచమాంబ దేవి విగ్రహ ప్రాణ ప్రతిష్టాపన శుక్రవారం ఘనంగా జరిగింది. తెల్లవారుజామున బ్రహ్మీణీ ముహూర్తంలో అర్చకులు వివిధ హోమాలు నిర్వహించారు. అనంతరం నూతనంగా తయారు చేయించిన అమ్మవారి విగ్రహాన్ని వేద మంత్రోచ్చారణాల మధ్య ప్రాణ ప్రతిష్టాపన చేశారు. అనంతరం కుంకుమార్చన, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేపట్టారు. భక్తులు తెచ్చిన వివిధ పూలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. నూతనంగా తయారు చేయించిన కలశాన్ని ఆలయ పైభాగంలో ఉన్న గాలి గోపురంపై ఏర్పాటు చేశారు. అంతకుముందు గ్రామ వీధుల్లో ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. మహిళలు నీటిని ధార పోస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ వారు ప్రసాదం అందజేశారు. కెంచమాంబ దేవి విగ్రహ ప్రాణ ప్రతిష్టాపనకు కర్ణాటక రాష్ట్రం యలెరాంపుర పీఠాధిపతి హనుమంతనాథ స్వామిజీ హాజరయ్యారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయాన్ని సుందరంగా నిర్మించడం సంతోషంగా ఉందని తెలిపారు.

మాజీ మంత్రి నర్సేగౌడ్ పూజలు..

కెంచమాంబ దేవికి మాజీ మంత్రి హెచ్‌బీ నరసేగౌడ్ ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు నర్సేగౌడ్‌కు ఘనంగా స్వాగతం పలికారు. అలాగే మడకశిర నియోజకవర్గం కుంచిటి వక్కలిగ అధ్యక్షుడు అనంతరాజు కూడా ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ అభివృద్ధికి రూ.25 వేలు విరాళంగా ఇచ్చారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి



సంతకం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్

హిందూపురం: మున్సిపాలిటీ పరిధిలో దాదాపు 24 పనులు, 60 కిలోమీటర్ల డ్రైన్లు, రోడ్లు, డివైడర్ల నిర్మాణానికి రూ.200 కోట్ల నిధులతో పనులు చేసేందుకు టార్గెట్‌గా పెట్టుకున్నట్లు మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం ప్రత్యేక పూజల అనంతరం ఆయన తన చాంబర్‌లోకి ప్రవేశించారు. తొలి సంతకం అభివృద్ధి పనులపై పెట్టినట్లు తెలిపారు. ఏడాది కాలంలో ఈ నిధులు దుర్వినియోగం కాకుండా అందరి సహకారంతో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామన్నారు. మున్సిపాలిటీలో అవినీతికి తావులేకుండా మంచి పరిపాలన అందించడానికి ప్రయత్నిస్తానన్నారు. సెలక్షన్ మున్సిపాలిటీలో ప్రజాప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని కౌన్సిల్ పని చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాసులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుకు గురైన వ్యక్తికి ప్రథమ చికిత్స

రొళ్ల: మండల పరిధిలోని జీబీహళ్లి గొల్లహట్టి చెందిన రైతు చిక్కన్నకు శుక్రవారం మధ్యాహ్నం హఠాత్తుగా ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. దీంతో పరీక్షించిన డాక్టర్లు సాయికులదీప్, మహమ్మద్‌సోయాబ్ తదితరులు రూ.45 వేలు విలువ చేసే టెనెక్ట్‌ప్లస్ ఇంజక్షన్ వేశారు. కొంత సేపటికి చిక్కన్న ఆరోగ్యం కుదుట పడటంతో మెరుగైన వైద్యం చికిత్సల కోసం అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం చిక్కన్న ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రేపు మహాశివరాత్రి ఉత్సవాలపై సమావేశం

లేపాక్షి: లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయంలో ఈనెల 25 నుంచి జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలపై ఆదివారం ఉదయం 11 గంటలకు ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25 నుంచి మార్చి 1వ తేదీ వరకు బ్రహోత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. సర్పంచ్, గ్రామ పంచాయతీ పెద్దలు, ప్రజలు, అధికారులు హాజరై ఉత్సవాలు విజయవంతం చేయడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు ఇవ్వాలని కోరారు.

స్టార్టర్ల చోరీ

అగళి: కదిరేపల్లి గ్రామంలో రైతులు నరసింహప్ప, దొడ్డయ్య చెందిన పొలంలో గురువారం రాత్రి రెండు స్టార్టర్లు, 50 మీటర్లు కేబల్ వైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. శుక్రవారం బాధితులు రైతులు నరసింహప్ప, దొడ్డయ్య స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

గుడిబండ: మండల పరిధిలోని కరికెర గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గోవిందు గౌడ్ (70) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, పార్టీ మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడ్, సర్పంచులు కరుణాకర్ గౌడ్, గౌరమ్మ, పలువురు నాయకులు సంతాపం తెలిపారు. పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. మృతుడికి భార్య కమలమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. శనివారం కరికెర గ్రామంలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సంక్షిప్త సమాచారం


నేటి నుంచి షిరిడీ సాయి ఆలయ వార్షికోత్సవం

రొద్దం: మండల పరిధిలోని ఆర్.మరువపల్లి పాత చెక్ పోస్ట్ వద్ద వెలసిన సద్గురు షిరిడీ సాయి ఆలయ 19వ వార్షికోత్సవాన్ని రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు అర్చకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయం వద్ద హోమాలు, అర్చనలు, అభిషేకాల అనంతరం షిరిడీ సాయినాథుడికి ప్రత్యేక పూజలు చేస్తామన్నారు. ఆదివారం ఉదయం జ్యోతుల ఉత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు. నవగ్రహ శాంతి యజ్ఞం, సద్గురు ప్రవచనాలు, పాదపూజ, మధ్యాహ్నం బాబాకు పల్లకీ సేవ, ఊరేగింపు తదితర కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు.

గోరంట్ల ఎస్‌ఐగా బాలాజీ నాయక్

గోరంట్ల: గోరంట్ల నూతన ఎస్‌ఐగా బాలాజీ నాయక్‌ను నియమిస్తూ ఎస్పీ రత్న శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

షిరిడీ సాయి ఆలయ నిర్మాణానికి భూమిపూజ



పూజలు చేస్తున్న అర్చకులు

అమరాపురం: మండల కేంద్రంలోని మడకశిర రోడ్డులో షిరిడీ సాయిబాబా ఆలయ నిర్మాణానికి అర్చకుడు హరీష్ భట్టార్ ఆధ్వర్యంలో శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. గ్రామంలోని భక్తులు, సభ్యులు అందించిన విరాళాలతో ఆలయాన్ని సుందరంగా నిర్మిస్తామని పేర్కొన్నారు. సంవత్సరం లోపు ఆలయాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు.

ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ట

రొళ్ల: మండల పరిధిలోని గొట్టుగుర్కి గ్రామంలో ముత్యాలమ్మ దేవి విగ్రహాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. వేదపండితుల సమక్షంలో హోమం, కుంకుమార్చన, అభిషేకం, బలిహరణ తదితర పూజలు నిర్వహించారు. ముత్యాలమ్మ మూల విగ్రహాన్ని వివిధ రకాల పూలతో అలంకరణ చేసి మహామంగళ హారతి ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగరాజు, ముదుపేగౌడు, గోవిందప్ప, నరసింహమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి

మడకశిర: టెన్త్ విద్యార్థులు పరీక్షలను భయపడకుండా ఇష్టపడి రాయాలని బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి నిర్మలజ్యోతి, క్రియేటర్ కృష్ణ సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఎస్‌వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమావేశ భవనంలో బీసీ సంక్షేమ హాస్టళ్లల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రేరణ–శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మార్చి 17 నుంచి 10వ తరగతి పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. సమావేశంలో అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్లు గంగాధర్, సుబ్బరాయుడు, వార్డెన్లు పెద్దన్న, వెంకటరమణ, సికిందర్, హుస్సేన్, కేశవప్ప, శ్రీనివాసులు, వెంకటేష్, సునీత పాల్గొన్నారు.

వృథా అవుతున్న తాగునీరు

హిందూపురం: మున్సిపాలిటీ పరిధిలోని పలుచోట్ల మున్సిపల్ వాటర్ పైప్‌లైన్ దెబ్బతినడంతో గంటల తరబడి తాగునీరు వృథాగా ప్రవహిస్తోంది. ఆర్టీసీ కాలనీలో మొదటి క్రాస్‌లో ఓవర్ హెడ్ ట్యాంక్ రోడ్డులో పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడింది. కాల్వల వెంబడి నీరు పారుతోంది. అలాగే ఎస్‌ఎస్‌పీఆర్ మహిళా కాలేజ్ సమీపంలో వాల్స్ వద్ద పైప్ పగిలి నీరు వృథా అవుతోంది.

వాల్మీకి జాతరకు తరలిరండి

పావగడ: దావణగెరె జిల్లా రాజనహళ్లి మహర్షి వాల్మీకి గురుపీఠంలో ఈనెల 8, 9 తేదీల్లో మహర్షి వాల్మీకి జాతర నిర్వహిస్తున్నట్లు స్థానిక అఖిల కర్ణాటక వాల్మీకి నాయక మహాసభ జిల్లా అధ్యక్షుడు పాళేగార్ లోకేశ్ తెలిపారు. జాతరకు తాలూకా వ్యాప్తంగా వాల్మీకులు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక అతిథి గృహంలో శుక్రవారం నిర్వహించిన వాల్మీకి సంఘం నాయకుల సమావేశంలో జాతరకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ ఏడాది కూడా వాల్మీకి జాతర వైభవంగా జరుగుతుందన్నారు. వివిధ ధర్మాలకు చెందిన మఠాధీశులు, సాధువులు, కవులు పాల్గొంటారన్నారు. వాల్మీకి జాత్ర సమితి అధ్యక్షుడు కరవే లక్ష్మి నారాయణ మాట్లాడుతూ.. వాల్మీకి జాతర నిర్వహణకు తమకు తోచినంత విరాళాలు అందివ్వాలని స్థానిక వాల్మీకి కులస్తులను కోరారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు బ్యాడనూరు శివ, మంజునాథ్, నాగరాజు, శ్రీనివాస నాయక, గౌడేటి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

అమరాపురం: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద శుక్రవారం వాల్మీకి మహర్షి విగ్రహ ఏర్పాటుకు వాల్మీకి కులస్తులు భూమిపూజ చేశారు. త్వరలోనే వాల్మీకి విగ్రహన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం అర్చకుడు నరసింహ భట్టార్ ప్రత్యేక పూజలు చేపట్టారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం

రొళ్ల: నులిపురుగుల నివారణతో చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామరావు పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో పాటు ఆరోగ్య, ఆశావర్కర్లకు 'నేషనల్ డీవార్మింగ్ డే' నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 10వ తేదీన అన్ని పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేయాలన్నారు.

అగళి: మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాల, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ ఉమేష్, పీహెచ్ఎన్ లక్ష్మీదేవమ్మ, ప్రధానోపాధ్యాయుడు వరదరాజు పాల్గొన్నారు

త్వరలో ఉద్యమకారులకు సన్మానం



విరాళం అందిస్తున్న గౌడేటి ప్రభాకర్

పావగడ: తుంగభద్ర, ఎత్తినహొళె జలాశయాల నుంచి పైప్‌లైన్ల ద్వారా పావగడకు తాగు, సాగునీటిని తరలించడానికి దశాబ్దాలుగా పోరాటాలు సాగించి విజయం సాధించిన నీరావరి ఉద్యమకారులను త్వరలో సన్మానిస్తామని స్థానిక నీరావరి పోరాట సమితి అధ్యక్షుడు ఎస్. శివప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక అతిథి గృహంలో నిర్వహించిన ముందస్తు సభలో ఆయన మాట్లాడారు. ఇందులో భాగంగా ఇప్పటికే వెయ్యి మందికి పైగా ఉద్యమకారులను గుర్తించామన్నారు. ఉద్యమకారుల శ్రమను నేటి యువతకు తెలిసేలా సన్మాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అనంతరం ఉద్యమకారుల సన్మానానికి గౌడేటి ప్రభాకర్ రూ.25 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో నీరావరి పోరాట సమితి కార్యదర్శి సొగడు వెంకటేశ్, తాలూకా రైతు సంఘం అధ్యక్షుడు నరసింహారెడ్డి, ట్రెజరర్ పురుషోత్తమ రెడ్డి, జేడీఎస్ మహిళా నాయకురాలు సాయిసుమన, బ్యాడనూరు శివ, మానం శశికిరణ్, వివిధ సంఘ సంస్థల పదాధికారులు పాల్గొన్నారు.

కొండలమ్మ విగ్రహ ప్రతిష్ట



అలంకరణలో కొండలమ్మ దేవత

హిందూపురం: మలుగూరు గ్రామంలో కొండలమ్మ విగ్రహాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. గ్రామ నడిబొడ్డున ఉన్న పురాతన ఆలయాన్ని గ్రామపెద్దలు పునరుద్ధరించిన విషయం తెలిసిందే. మూడు రోజులుగా వేద పండితులతో గణపతి పూజ, గంగపూజ, కలశ స్థాపన అనంతరం శుక్రవారం తెల్లవారుజామున అమ్మవారి విగ్రహ స్థాపన, ప్రతిష్ట, దీక్షా హోమాలు చేపట్టారు. మంగళహారతి అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

మట్టి తరలింపుపై చర్యలు తీసుకోండి



ట్రాక్టర్లతో మట్టి తరలిస్తున్న దృశ్యం

సోమందేపల్లి: మండల కేంద్రంలోని చెరువు నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న టీడీపీ నాయకులు శ్రీనివాసులు, రంగప్పపై చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి బాలస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం చెరువు నుంచి మట్టి తరలిస్తుండగా ఆయన అడ్డుకున్నారు. అధికార పార్టీ నాయకులతో అధికారులు కుమ్మకై గత ఆరు నెలలుగా ఇష్టారాజ్యంగా మట్టి తరలించి సొమ్ము చేసుకుంటున్నారని బాలస్వామి ఆరోపించారు. జేసీబీలతో తవ్వకాలు జరపడంతో చెరువులో గుంతలు ఏర్పడ్డాయన్నారు. ఇంత జరుగుతున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

వీల్‌చైర్ల పంపిణీ



దివ్యాంగులకు వీల్‌చైర్లు పంపిణీ చేసిన దృశ్యం

పావగడ: స్థానిక వివేకానంద దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో 19 మంది దివ్యాంగులకు శుక్రవారం వీల్ చైర్లు పంపిణీ చేశారు. అలాగే వివిధ అవయవాలు లోపించిన 36 మందికి కృత్రిమ అవయవాలు అమర్చారు. పట్టణంలోని శ్రీనివాస నగర్‌లో ఉన్న వివేకానంద దివ్యాంగుల సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నరేంద్ర ఫౌండేషన్ అధ్యక్షుడు సుధీంద్ర మాట్లాడారు. సుమారు రూ.7 లక్షలు విలువ చేసే కృత్రిమ అవయవాలు, రూ.4 లక్షల విలువ చేసే వీల్‌చైర్లను దివ్యాంగులకు అందించామన్నారు. అంగ వైకల్యంతో బాధపడే దివ్యాంగుల సొంతంగా కార్యకలాపాలు నిర్వహించుకోవచ్చన్నారు. ఈ శిబిరంలో పలువురు సంఘం పదాధికారులు పాల్గొన్నారు.